అప్పుడే బ్యాంక్ మేనేజర్ వచ్చాడు.

"సర్ ..... మీకు ఫోన్ ..... మహతిగారట ..... " ఫోన్‌ని రిసీవ్ చేసుకున్న వ్యక్తి చెప్పాడు.

బ్రాంచ్ మేనేజర్ ఫోనందుకున్నాడు.

"ఎస్ ..... స్పీకింగ్ ..... "

తనకేం కావాలో అవతలి నుంచి చెప్పింది మహతి.

"కాన్ఫిడెన్షియల్‌గా ఉంచమని మధుకర్ రిక్వెస్ట్ చేశారమ్మా ....."

"ఆ విషయం నాకు తెలుసు సర్ ..... కానీ మీరు నాకు చెప్తున్నారు ..... " హిప్నటైజ్ చేస్తునట్టుగా అంది మహతి.

తను మహతికి చెప్పినట్టుగా మధుకర్‌కు తెలీదు గదా ..... ఆ ఐడియా రావడంతో బ్రాంచ్ మేనేజర్ లెడ్జర్ తెప్పించి ఎమౌంట్ తనే చెప్పాడు.

సరిగ్గా అదే సమయంలో--

బ్యాంక్ క్లర్కు కమల, మధుకర్ మాటల గారడీలో పడిపోయింది. ఆమె ముందు లెడ్జర్ బుక్ ఉంది- వెంటనే మహతి ఎకౌంట్‌లో ఉన్న ఎమౌంట్ చెప్పింది.

"థాంక్యూ మేడమ్ ..... బై ది బై మీకింకా పెళ్ళి కాలేదు కదూ ..... " అడిగాడు మధుకర్.

"నో సర్ ....."

"ఐనో ..... అందుకే మీ వాయిస్ అంత మెలోడియస్‌గా ఉంది ..... థాంక్యూ ఒన్స్ ఎగైన్ ..... " ఫోన్ పెట్టేసాడు మధుకర్.

పెళ్ళికి, వాయిస్‌కీ ఏమిటి సంబంధం పెళ్ళి కానట్టు వాయసే చెప్తుందా? ఇప్పటివరకూ తన వాయస్ అంత బాగుందని చెప్పిన వాళ్ళెవరూ లేరు. ఆ రోజంతా మరి కమల డ్యూటీ చేయలేకపోయింది.

*                    *                    *                    *

మధుకర్ ఎకౌంట్‌లో ఎంత ఎమౌంట్ ఉందో తెలియడంతో గర్వంగా ఊపిరి పీల్చుకుంది మహతి.

'మిస్టర్ మధూ ..... విజయం నాదే' ఆ తృప్తి, ఇన్నాళ్ళూ పడిన కష్టాన్ని మరిపించేదిగా ఉంది.

*                    *                    *

మహతి ఎకౌంట్‌లో ఎంత ఎమౌంటుందో తెలియడంతో మధుకర్ షాక్ తిన్నాడు మొదట.

"ఇంకా పదిహేను రోజులుంది ..... మహతీ ..... ఫస్టు ఉదయం చూడు విజయం ఎవరిదో తేలుతుంది."

చివరి పదిహేను రోజుల్లో తనెంత ఎమౌంట్ బ్యాంక్‌లో వెయ్యగలడో అంచనా వేసుకుంటూ అనుకున్నాడు మధుకర్.

నిమిషాలు, గంటలు,రోజులు గడుస్తున్నాయి.

ఏ పని చేసినా, బ్యాంకు ఎకౌంట్ కళ్ళల్లో కదలాడుతోంది.

ప్రతిరోజూ--

ఏదో ఒక టైమ్‌లో ఇద్దరూ బ్రాంచ్ మానేజర్‌కి ఫోన్ చేస్తున్నారు. ప్రతిరోజూ వాళ్ళిద్దరూ ఎంతో కొంత ఎమౌంట్ బ్యాంక్‌లో వేస్తున్నారు. స్వయంగా రావడంగానీ, లేదా మనిషి ద్వారా పంపడం గానీ-- వారం రోజులు గడిచాయి--

బ్యాంకు మేనేజర్‌కి, మధుకర్, మహతి ఎకౌంట్లకు డీల్‌చేసే క్లర్కులకు, రోజూ వాళ్ళ తరపున వచ్చే వ్యక్తులకోసం చూడడం అలవాటైపోయింది.

ఆ రోజు--

బ్రాంచ్ మానేజర్ రూంలో కమల, ఇంకోక్లర్క్ కూర్చున్నారు.

"ఏం సార్ -- ఇవాళింకా మనవాళ్ళు దగ్గర్నుంచి ఎవరూ రాలేదు ..... " కమల అడిగింది.

"ఇంకో అరగంట టైముంది కదండి-- వాళ్ళే యిద్దరూ స్వయంగా వస్తారేమో--" సాలోచనగా అన్నాడు బ్యాంకు మానేజర్.

"ఇద్దరి మధ్యా ఏదయినా ఛాలెంజ్ వుందంటారా-- యేదో వున్నట్టుంది" పక్కనున్న క్లర్కు సందేహం వ్యక్తం చేశాడు.

"రూపాయల్లో పుట్టి, రూపాయల్లో పెరిగిన వాళ్ళు రూపాయల్తో ఆడుకుంటారు ..... దిసీజ్ ఎ గేమ్ ఆఫ్ కరెన్సీ. మనకేమైంది. మన డిపాజిట్లు పెరుగుతాయ్-"బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ గ్లాస్ డోరులోంచి బయటికి చూసి, స్ప్రింగ్‌లా లేచాడు. పరుగు, పరుగున తన రూంలోంచి బయటికొచ్చి మెయినుగేటువేపు పరుగెత్తాడు. అక్కడా-

అప్పుడే ఆగిన లేత నీలం రంగు కంటెస్సా కారులోంచి సాక్షాత్తూ దిగిన-

ది గ్రేట్ బిజినెస్ మాగ్నట్ రాఘవేంద్ర నాయుడుని చూసి, ఆయన్నెలా రిసీవ్ చేసుకోవాలో తెలీక ఒక్క క్షణం కలవరపడిపోయి, క్షణాల్లో తేరుకున్నాడు.

"వెల్‌కమ్ సర్ ..... " కంగారుగా అన్నాడు.

"మీరేనా బ్రాంచ్ మానేజర్."

"అవున్సార్ -- నేనే సర్."

"మీతో అయిదు నిమిషాలు మాట్లాడాలి."

రాఘవేంద్ర నాయుడు తనతో అయిదు నిమిషాలు మాట్లాడడానికి రావడం ..... ఊహించలేకపోతున్నాడు బ్రాంచ్ మానేజర్.

తన ఛాంబరులోకి తీసుకెళ్ళాడు బ్రాంచ్ మానేజర్. తనెందుకొచ్చాడో చెప్పడం ప్రారంభించాడు రాఘవేంద్ర నాయుడు. ఆయన చెప్పిందానికి మౌనంగా తలూపడం తప్పించి, మరో మాటలేదు బ్రాంచ్ మానేజర్‌కి. సరిగ్గా- ఫైవ్ మినిట్స్- ఫైవ్ మినిట్స్- తర్వాత రాఘవేంద్ర నాయుడు అక్కడలేడు.

బ్రాంచ్ మానేజరు ఆ షాక్‌నుండి తేరుకోడానికి గంటన్నరపట్టింది.

ఇంకా ఫస్టు మూడురోజులే వుంది. ఆ రోజు సాయంత్రం- అయిదు గంటలైంది. ఖైరతాబాద్‌లోని, విశ్వేశ్వరయ్య భవన్‌లో టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీలో మోడ్రన్ ఛేంజస్ గురించి చెప్తోంది మహతి. జన్నీ ఫాబ్రిక్స్ ఎమ్.డి. మహతి ఆ సెమినార్‌లో పాల్గొంటోందని తెల్సిన-- సిటీలోని బిజినెస్‌పీపుల్ ప్రత్యేకంగా ఆమెనుచూడడానికి రావడం విశేషం. అతి తక్కువ సమయంలో, ఒక కొత్త సంచలనాన్ని సృష్టించిన మహతి అక్కడి కేంద్రబిందువు.

ఆడిటోరియం అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ ఆడిటోరియం ఒకే ఒక్క గొంతు ప్రతిధ్వనిస్తోంది. ఆ గొంతు మహతిది.

The textile machineries need automation - Development of electronic interfaces in Collaboration with CEERI, Pilani and CEDT Elsc Bangalore will enable the central computer at computer center to communicate with the machinery and testing instruments in the laboratories of the Institute.
అంతవరకూ చదివి ఊపిరి పీల్చుకుని, మరో పేరా చదవడానికి ఉద్యుక్తురాలయింది మహతి.

అప్పుడే- సరిగ్గా అప్పుడే- కడుపులో చిన్న కదలిక. ఆ కదలిక నొప్పిగా మారడానికి అట్టేసేపు పట్టలేదు. ముందు వరసలో రఘురామశెట్టి, కళ్యాణి, వనజాక్షి

మహతి ముఖంలో మారుతున్న భావాలను గమనిస్తున్నారు.   మరోసారి, తనని తను నిలదొక్కుకోడానికి ప్రయత్నం చేసింది మహతి.

"సారీ ..... " ఏదో చెప్పబోయి, తూలి పడబోయింది.

ఆ పరిస్థితిని ముదే ఊహించిన వనజాక్షి పరుగు, పరుగున వెళ్ళి మహతిని పట్టుకుంది.

"అంబులెన్స్ ప్లీజ్ ..... "

మరో అయిదు నిమిషాల్లో--

అంబులెన్స్‌లో నొప్పులు పడుతోంది మహతి. అంబులెన్స్ శరవేగంతో ఆస్పత్రి వేపు పరుగులు తీస్తోంది.

*    *    *

సుమదేవ్ ఎదురుగా కూర్చున్నాడు మధుకర్. అంతకు రెండ్రోజులనుంచి ఒక ముఖ్యమైన విషయం మధుకర్‌తో మాట్లాడాలని సుమదేవ్ ప్రయత్నిస్తున్నాడు. మధుకర్ పరిస్థితి కూడా అలాగే ఉంది.  ఇప్పటివరకూ తను చేసిన వర్క్‌కు సంబంధించి బకాయిల్ని అడుగుదామని అనుకుంటున్నాడు మధుకర్.     మూడు రోజులే-

ఈ మూడు రోజులే--

తనను తను ప్రూవ్ చేసుకోవాలి. మహతి కన్నా ఒక మెట్టు పైన ఉండాలి.

మహతి దగ్గర ఓడిపోకూడదు - ఓడిపోకూడదు..

"రెండ్రోజుల్నించిచూస్తున్నాను ఏమిటీ ..... పరధ్యాసగా ఉన్నావ్. ఎనీ ప్రాబ్లమ్ ..... చెప్పయ్యా ..... " చాలా అనునయంగా అడిగాడు సుమదేవ్ .

"ప్రాబ్లమంటే ..... ఒక రకంగా ప్రాబ్లమ్ సర్ ..... "

“నీలాంటి కుర్రవాడికి ఈ వయసులో ప్రాబ్లమ్ వచ్చిందంటే ఒకటి రొమాన్స్‌కి సంబంధించిందై ఉండాలి ..... లేదా మనీకి సంబంధించిందై ఉండాలి. నాకు తెల్సినంతవరకూ ..... నీకూ అమ్మాయిలకూ అసలు పడదు ..... యామై రైట్ ..... ” ముఖంలో ముఖం పెట్టి చూస్తూ అన్నాడు సుమదేవ్.

మధుకర్ పెదవులతోనే నవ్వేసాడు.

“రెండోది ..... మనీ ..... టెల్ మీ ..... బైయ్ నా దగ్గర దాపరికం ఎందుకు ... ”

“ఎస్సర్ ..... అవున్సార్ .....” గొణిగాడు మధుకర్.

“దానికి మొహమాటం ఏంటయ్యా ..... ఈ కంపెనీ నీకెంతో బాకీ వుంది ..... ఎంత కావాలో చెప్పు ..... నీకు మొహమాటం ఎక్కువ చూడు ..... బ్లాంక్ చెక్ ఇస్తాను ..... ఫైవ్ ..... టెన్ ..... ఫిఫ్టీన్ లాక్స్ ..... ఎంత ఎమౌంట్ కావలిస్తే అంత ఎమౌంట్ వేసుకో. నీ ఇష్టం ..... యాడ్ ఇండియా నాది కాదయ్యా ..... నీది ఎంటైర్ దిస్ ప్రాపర్టీ బిలాంగ్స్ టు యూ ..... ” అనేసి గబగబా జేబులోంచి చెక్‌బుక్ తీసి, ఒక లీఫ్ కట్ చేసి సైన్ చేసి మధుకర్ చేతిలో పెట్టాడు సుమదేవ్.

“నీ అపారమైన మేధస్సులో దీన్ని నెంబర్ వన్ యాడ్ ఏజెన్సీగా చేశావ్--- సరైన టైమ్‌లో నువ్వు నాకు దొరక్కపోతే ..... నేను కూడా పరాజితుణ్ణయిపోయేవాడ్నేమో ..... గాడీజ్ గ్రేట్ ..... మధూ ..... చాలా్రోజులయింది. నిన్నో కోరిక అడగాలనుకుంటున్నాను ..... అడగనా .... ”

“అడగండి సర్ ..... అడగడం ఏమిటి ..... యూ కెన్ డిమాండ్ మి ..... సర్ ... ”

“ఎస్. మై బోయ్ ..... నీ గురించి నాకు తెలుసు ..... ” తన మనసులో చాలా కాలంగా దాచుకున్న ఒక కోరికను అడగడానికి ఉద్యుక్తుడయాడు సుమదేవ్.

అదే సమయంలో --

“సర్ ..... మీ కోసం ..... ఎవరో వచ్చారు .....” బోయ్ వచ్చి చెప్పాడు.

"ఎవరట ..... " అడిగాడు సుమదేవ్.

"మీ అమ్మాయట సర్" ఆ మాటతో సుమదేవ్ గబుక్కున లేచి బయటికెళ్ళి, అయిదు నిమిషాల్లో లోనికొచ్చాడు. వెనక ఇరవై ఏళ్ళ అమ్మాయి!

"తమిస్ర ..... నా ఏకైక కూతురు ....." గర్వంగా పరిచయంచేశాడు మధుకర్‌కి.

"హలో ..... " పలకరించి, కూర్చోమని సీట్ ఆఫర్ చేసి ఏదో మాట్లాడబోతుండగా--

ఫోన్ మోగింది.

"అలాగా ..... వెంటనే బయలుదేరుతున్నాను" గబుక్కున సీట్లోంచి లేచాడు.

"సర్ ..... అర్జంటుగా బయటికెళ్ళాలి సర్."

"మళ్ళెప్పుడొస్తావ్ ..... "

"తెలీదు సర్ ..... " గాభరాగా డోర్ తెరుస్తూ అన్నాడు మధుకర్.

"ఓ. కే ..... ఓ. కే ..... కారీ ఆన్ ..... మై బోయ్ ..... " ఆ గొంతు మామూలుగానే ఉన్నా, ఆ గొంతు వెనకున్న గుండెలో ఎంతో విషాదం ఉంది. ఆ విషాదం ఒక సుమదేవ్‌కే తెలుసు .....

నీరసంగా కుర్చీలో కూర్చుండిపోయిన తండ్రిని అయోమయంగా చూసింది తమిస్ర.

* * * *

నర్సింగ్ హోం ముందు కారాగడం, అందులోంచి ఒక్క ఉదుటున కిందకు దిగడం-- లోనికి పరుగెత్తడం - మరుక్షణాల్లో జరిగింది.

లోనికి పరుగెత్తుకొస్తున్న మధుకర్‌ని ఎదురుగా వస్తున్న డాక్టర్ హేమ చూసింది.

మధుకర్ విష్ చేస్తే, ఏం చెప్పాలి ఎలా చెప్పాలో అర్థంకాలేదు హేమకు.

మహతి తన జీవితంలో ఏ విషయాన్నీ రహస్యంగా దాచలేదు. ఆఖరికి ప్రెస్టేజికి అడ్డంగా నిలిచే గర్భాన్ని కూడా.

కొన్నాళ్ళు ఎవరికీ కన్పించకుండా దూరంగా వెళ్ళిపోయి, ప్రసవానంతరం తిరిగొద్దామనుకొంది.

కానీ-- ఆ నిర్ణయాన్ని మరుక్షణమే మార్చేసుకుంది. పిరికిగా ఎక్కడికో పారిపోవడం, తనని తాను వంచించుకోవడం ఇష్టం లేకపోయింది.

తనతోపాటు, చెక్కు చెదరకుండా తన లక్ష్యం ఎలా వుంటుందో అలాంటిదే- తన బిడ్డకూడా లోకులతో, లోకంలోని నాలుకలతో తనకు పని లేదు.

వ్యక్తిత్వమనే దీపం ముందు-- మిగతావన్నీ గుడ్డి దీపాలే!

"మహతి ఏ రూంలో వుంది డాక్టర్ ..... "

"ప్రస్తుతానికి ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో వుంది. డోస్ట్‌వర్రీ ..... డెలివరీకి ఇంకా ఆరుగంటలు పట్టొచ్చు--" డాక్టర్ హేమ వెళ్ళిపోయింది.

అదే సమయంలో-

దూరంగా కారాగడం, ఆ కారులోంచి రాజేంద్ర ప్రసాద్, ఆయన భార్య దిగడంతో-- ఆస్పత్రినుంచి మధుకర్ బయటికి రాక తప్పలేదు.

*　　　　*　　　　*　　　　*

బయటకొచ్చిన మధుకర్ వెంటనే మెహదీపట్నంలోని బ్యాంకు కెళ్ళాడు. సుమదేవ్ ఇచ్చిన చెక్‌మీద అయిదు లక్షలు రాసి, తన ఎకౌంట్‌లో వేశాడు.

మహతి ఆస్పత్రిలో వున్నపుడు, తను గెలుపోటముల గురించి ఆలోచించడం .... నవ్వొచ్చింది మధుకర్‌కి.

అయినా తప్పదు-- తనని మార్చిన మనిషికి తనిచ్చే కానుక తన విజయం .....

ఆ ఒక్క ఆలోచన మధుకర్‌కి సంతృప్తినిచ్చింది.

*                    *                    *                    *

ఆ తర్వాత ప్రతి గంటకోసారి హాస్పిటల్‌కు ఫోన్ చేస్తూనే వున్నాడు మధుకర్.

అన్నిసార్లూ డాక్టర్ హేమలత మధుకర్‌కు ఫోనులో దొరకలేదు.

*                    *                    *                    *

మగతగా కళ్ళిప్పింది మహతి.

అంతులేని చీకటిలోంచి వెల్తురులోకి వచ్చినట్టుగా వుంది.

ఎదురుగా కనిపించిన హేమను చూసి నీరసంగా నవ్వింది.

"కంగ్రాట్స్ ..... మహీ మేల్ బేబీ ..... " చెప్పింది హేమ. బేబీ కోసం అటూ ఇటూ చూసింది.

"సేఫ్‌గా వున్నాడులే కంగారుపడకు--" నవ్వుతూ అంది. అప్పుడే తలుపు తీసుకొని వచ్చిన తల్లిని చూసి, నిస్సహాయంగా తలదించుకుంది మహతి.

తల్లి ప్రేమగా దగ్గరకొచ్చి తల నిమిరింది.

ఆ నిమిరింపులో ఎంతో మమత. మహతి మనసులో గూడు కట్టుకున్న ఎన్నో విషయాల్ని అర్థం చేసుకున్న ఆ మమతను చూసి, కనురెప్పలమాటున కన్నీటి తడి కదలాడింది.

అందరూ వెళ్ళిపోయాక-- హేమను దగ్గరగా పిల్చింది మహతి.

అప్పుడు ఒకే ఒక ప్రశ్న అడిగింది.